C.P. Brown Academy **సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో**

## విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

"ఇదే కత్తులబావి!'' కనబడుతున్న బావిని చూపిస్తూ చెప్పాడు కొండారెడ్డి. రాజారావు ఆసక్తిగా అటువైపు చూశాడు. వాళ్ళిద్దరూ బావి వైపు నడిచారు. మేమందరం గుంటూరు జిల్లాలో గల కొండవీడుకోట ఉన్న కొండపైకి వెళ్ళే మార్గంలో ఉన్నాం. మేమంటే నేను, రాజారావు, కొండారెడ్డి ఇంకా మాకు సాయంగా ఆహార పదార్థాలు, పానీయాలు (అంటే బీర్లు) మోసుకుంటూ కుర్రవాళ్ళు ఇద్దరు. బావిలోకి చూస్తూ రాజారావుతో బావిగురించి చెప్తున్నాడు కొండారెడ్డి. "పూర్వం కొండవీడుని రెడ్డిరాజులు పరిపాలించేటప్పుడు, చుట్టుపక్కల గ్రామాల్లో డెబ్బయి రెండు మంది పాళెగాళ్ళు ఊరికే తిరుగుబాట్లు చేస్తూ గ్రామాల్లో అలజడి సృష్టిస్తూ ఉండేవారట. వారిని అణచటానికి రాజు ఒక ఉపాయం చేశాడట. ఈ బావిని తవ్వించి అందులో కత్తులను నాటించాడట. తరువాత ఒక ఉత్సవము ప్రకటించి, పాళెగాళ్ళందరినీ ఆహ్వానించి రహస్యముగా వారిని ఈ బావిలోకి తోయించి చంపించి రాజ్యంలో శాంతి భద్రతలను పునరుద్ధరించాడని కథ. అందుకనే దీనికి కత్తులబావి అని పేరు వచ్చింది అని ఇక్కడివాళ్ళు చెబుతారు''. కొండారెడ్డి చెప్పాడు.



# గృహరాజు మేడ

**బి.వి.భద్రగిరీష్**

"పేరు బాగానేవుంది కానీ కత్తులేవీ, కనబడవేం!'' రాజారావు సందేహం వెలిబుచ్చాడు. నాకు నవ్వొచ్చింది. దేనినీ తొందరగా ఒప్పుకోకుండా వాదనచేయడం అతనికో సరదా. "ఒరేయ్! నీ పరధ్యానంతో చస్తున్నాము, ఇటు వచ్చి చూడరా బాబూ!'' అన్న రాజారావు పిలుపుతో నిరాసక్తంగా బావికేసి కదిలాను. "సతీదేవి మరణించినప్పుడు శివుడు కూడా విరహంతో ఇంత పరధ్యానంగా ఉండి ఉంటాడని అనుకోను. ఏరా, ఈ లోకంలో నీకొక్కడికి పెళ్ళాం ఉందిటరా! నిజమే, నీకు కొత్తగా పెళ్ళయింది. కానీ నువ్వు హైదరాబాదులో, నీ భార్యేమో ట్రైనింగ్ కోసమని బెంగుళూరులో ఉన్నంత మాత్రాన ఇంత విరహవేదన పడాలా! నన్ను చూడు మా ఆవిడ దగ్గర లేకపోతే ఎంత ఫ్రీగా ఉంటానో! నీ పరధ్యానాన్ని తగ్గించి, మనం ఇక్కడికి ఎందుకువచ్చామో గుర్తు తెచ్చుకొని, చుట్టుపక్కల ప్రదేశాలు చూడరాబాబూ!'' నన్ను చూస్తూ రాజారావు కామెంట్ చేశాడు.

రాజారావు మాటలతో నా ఆలోచనలు కిరణ్మయి మీదకి మళ్ళాయి. మా ఇద్దరికి పెళ్ళయి సంవత్సరం కూడా కాలేదు. నిజానికి పెళ్ళయిన కొత్తలో జీవితం ఎంతహేపీగా ఉండాలి. కానీ, నాకే ఎందుకిలా? రాజారావు చెప్పినట్టు, కిరణ్మయి బెంగుళూరు ట్రైనింగ్ కోసమని వెళ్ళిందా లేక నాకు దూరంగా ఉందామని వెళ్ళిందా! నిజమేమిటో నాకే తెలుసు. పెళ్ళయిన కొత్తలో బాగానే ఉంది. కానీ తర్వాత ఎందుకో తెలీకుండా ఇద్దరి మధ్య గొడవలు. కీచులాటలు. ఇంట్లో ప్రశాంతత లేకుండా పోయింది. కిరణ్మయి అభిమానం గల యువతి అని పెళ్ళయిన మొదట్లోనే గ్రహించాడు తను. తన తప్పులేకపోతే సర్దుకు పోవడానికి ఎంత మాత్రం ఒప్పుకోదు. తను భర్త కదా, ఆ అధికారంతో ఏదైనా చెప్పబోతే మేల్ ఛావనిజం అంటూ కొట్టి పారేస్తుంది. ఆ రోజు బండి చెడిపోయిందని, తన కొలీగ్ బైక్ మీద కిరణ్మయి వచ్చినప్పుడు మరీ పెద్ద గొడవైపోయింది. "నాకు ఫోన్ చేయవచ్చు కదా, కొలీగ్ బైక్మీద రావడమెందుకు'' అని అడిగాడు తను. "నీకు ఫోన్ చేశాను. నీ సెల్ ఆఫ్ చేసి వుంది'' అంటుంది కిరణ్మయి. "నా సెల్ ఆఫ్ చేసి లేదు'' అని చాలాసేపు వాదించాడు తను.

దానితో ఊరుకోకుండా ఏదేదో మాట్లాడేశాడు. వెంటనే తన పుట్టింటికి వెళ్ళిపోయింది. రెండు రోజుల తర్వాత వచ్చి బెంగుళూరుకి ట్రైనింగ్‌కి వెళ్తున్నానని ముభావంగా చెప్పి బ్యాగ్ సర్దుకొని వెళ్ళిపోయింది. ఇప్పటికి నెలైంది. ఒక ఫోన్ లేదు. మెస్సేజ్ లేదు. గొడవ సంగతి నేను మా పెద్దవాళ్ళకి చెప్పలేదు. బాధ పడతారని. కిరణ్ కూడా చెప్పినట్టులేదు. వాళ్ళందరూ మేమిద్దరం సఖ్యంగానే ఉన్నామని అనుకుంటున్నారు. మేమిద్దరం దూరంగా ఉన్నందుకు సానుభూతి చూపిస్తుంటారు. ఏవో మాటలు చెప్పి నెట్టుకొస్తున్నాను. నిజానికి తనతో గొడవైన తర్వాత నేను సెల్ ఫోన్ చూసుకుంటే నిజంగానే ఆఫ్ అయి వుంది. అంత గొడవైన తర్వాత నా తప్పు వొప్పుకోవటానికి అహం అడ్డు వచ్చింది. సరే, తనైనా సర్దుకుపోవచ్చు కదా. ఆడదానికి అంత పంతమా, చూద్దాం లెమ్మని నేను కూడా ఊరుకున్నాను.

ఇలాఉండగా, శివరాత్రికి కోటప్పకొండ వెళ్ళివద్దామని ప్రపోజల్ పెట్టాడు నా ఫ్రెండ్ రాజారావు. వాడు నాకు స్కూల్ నుంచీ ఫ్రెండ్. ఇద్దరమూ ఇప్పుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లం. మనసుకు కాస్త తెరిపిడిగా ఉంటుందని నేను సరేనన్నాను. మిగతా విషయాలన్నీ రాజారావే చూసుకున్నాడు. కొండారెడ్డికి ఫోన్‌చేశాడు. కొండారెడ్డి మాకు మరో బాల్యమిత్రుడు. వాడు టీచర్‌ట్రైనింగ్ పూర్తిచేసి కొండవీడు ఊర్లో టీచరుగా పనిచేస్తున్నాడు. కొండారెడ్డి ప్రోగ్రాం ఖరారుచేసి మాకు కబురు చేశాడు. శివరాత్రి రోజు కోటప్పకొండ దర్శనం. తర్వాత రోజు కొండవీడు కోట ఉన్న కొండ మీదకి ట్రెక్కింగ్. రాత్రికి అక్కడే బసచేసి ఉదయానికి కొండ దిగి రావడం. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ కొండారెడ్డి చూసుకున్నాడు. అలా మేము బయల్దేరి కోటప్పకొండ దర్శనం చేసుకొని, ఇప్పుడు కొండవీడు కోట ఉన్న కొండ ఎక్కుతున్నాం.

కత్తులబావి దాటి మా ప్రయాణం సాగింది. కొండపైకి చేరుకొనే సరికి ఇంచుమించుగా సాయంత్రం నాలుగయింది. మధ్య, మధ్యలో రాజారావు వేసే యక్షప్రశ్నలకు విసుక్కోకుండా, అక్కడ వున్న పాడు బడిన కోట శిధిలాలు, గుళ్ళు మాకు చూపిస్తూ వాటి గురించి విశేషాలు వివరించాడు కొండారెడ్డి. కొంతదూరంలో వున్న మట్టిదిబ్బలను చూపిస్తూ వాటిని గృహరాజు మేడ దిబ్బలంటారని చెప్పాడు. మళ్ళీ రాజారావు ఎక్కడ తిడతాడో అన్న భయంతో అప్పటిదాకా తెచ్చి పెట్టుకున్న ఉత్సాహం ప్రదర్శిస్తున్న నేను, కుతూహలంగా ''అంటే'' అని అడిగాను. ఎందుకు అడిగానో మాత్రం కారణం చెప్పలేను. ''ఒక కథ ఉంది'' అన్నాడు కొండారెడ్డి. ''ఇందాకటి నుంచి నువ్వు చెపుతున్నవి అవే కదా, ఇది కూడా చెప్పు'' వ్యంగ్యంగా ప్రోత్సహించాడు రాజారావు. కొండారెడ్డి చెప్పనారంభించాడు.



అది రెడ్డిరాజులలో ప్రముఖుడు అయిన పెదకోమటి వేమారెడ్డి కొండ వీడును పాలి స్తున్న కాలం. ఆయన ఆస్థాన విద్యాధికారి శ్రీనాథుడు. అంటే ఇప్పటి ఎడ్యుకేషన్ మినిస్ట రులాగా అన్నమాట. ఆయన సమకాలికంగా విజయనగర సామ్రాజ్యాన్ని ప్రౌఢదేవరా యులు పాలిస్తుండే వాడు. శ్రీనాథుడు, తన పాండిత్య ప్రదర్శనకోసం ఆయన ఆస్థానాన్ని సందర్శించి, ఆస్థాన కవి అయిన గౌడడిండిమ భట్టును వాదనలో ఓడించి, అతని కంచుఢ క్కను పగులగొట్టించాడు. ప్రౌఢ దేవరా యులు, తన ముత్యాలశాలలో, శ్రీనాథునికి కనకాభిషేకం జరిపించి గౌరవించాడు. అయితే డిండిమభట్టుకు మాత్రం శ్రీనాథునిపై కోపం పోలేదు. ఎలాగైనా, శ్రీనాథుని, రెడ్డిరాజ్యాన్ని అవమానించాలని అవకాశం కోసం వెతుకుతు న్నాడు.

ఒకరోజు ఆస్థానంలో డిండమభట్టు రాయ లవారిని ఉద్దేశించి, ''మహా రాజా, తమరు సామ్రాజ్యాధిపతులు. రాజులందరిలోకి రాజు. అందుకు గుర్తుగా ఒక గొప్పమేడను నిర్మిస్తే బాగుంటుంది. దానిని చూసి ఇతర రాజ్యాల వారు అసూయచెందేలా ఆ భవన నిర్మాణం జరగాలి'' అని కోరాడు. ప్రౌఢ దేవరాయలు అందుకు సమ్మతించాడు. ఆస్థానంలో ఉన్న శ్రీనాథునికి అర్థమయింది. ఇది తనను, తన రాజ్యాన్ని అవమానపరచ డానికి డిండిముడు పన్నిన పన్నాగమని. శ్రీనాథుడు ఆలోచిం చాడు 'రాయలు సౌమ్యుడు, రాజనీతిజ్ఞత గల వాడు. కానీ అతడికి కించిత్ గర్వ ముంది. సాటిరాజులను కించపర్చేవిధంగా, తన భృత్యులిచ్చే సలహాలను పాటిస్తూవుంటాడు. ఆయనలో ఈ గుణాన్ని సరిదిద్దగలిగితే ఆదర్శ వంతు డవుతాడు. అందుకు భౌతిక స్పర్ధల కన్నా విద్యా స్పర్థే సరయినది. రెడ్డి రాజ్యం విద్యలలో విజయనగర సామ్రాజ్యానికి తీసిపో దని నిరూ పించాలి' అని నిర్ణయించుకొని పైకి లేచి ''మహారాజా, డిండిముడు చెప్పినది సబ బుగానే వుంది. కానీ, అటువంటి సౌధం ముందే కట్టబడి వున్నప్పుడు, మరో సౌధం రెండవదిగా నిర్మించడం, తమవంటి మహా రాజులకు శోభించదు. కావున తమరు ఆ ప్రయత్నం మానుకో వలసిందిగా కోరుతు న్నాను'' అని ప్రకటించి కూర్చున్నాడు. సభలో కల కలం రేగింది. రాయలకు కోపం వచ్చినా, మాట్లాడినది శ్రీనాథ మహాకవి కావడంతో తమాయించుకొని, ''మహాకవీ, ఈ ప్రపం చంలో గొప్పదిగా చెప్పుకొనదగ్గ సౌధం ఇంత కుముందే కట్టబడినదా? ఎక్కడ? దానిని మీరు చూచినారా? ఆ వివరాలు తెల్పండి!'' అని కోరాడు. శ్రీనాథుడు లేచి, ''రాజా, అటువంటి సౌధం ఒకటి, మా రెడ్డిరాజ్యం రాజధాని అయిన కొండవీడునందు నిర్మించబడి వుంది. అది చిత్రవిచిత్రమైన కల్పనలతో, వాస్తురీతు లతో, ద్వాపరయుగము నందు యముడు నిర్మించిన మయసభను తలదన్నేలా ఉంటుంది. అది గృహములన్నింటి లోకి రాజు. అందువలన 'గృహరాజసౌధం' అనే పేరుతో దానిని ప్రజలు చెప్పుకుంటారు'' అని ప్రకటిం చాడు. అప్పుడు డిండుముడు లేచి, ''మహా రాజా, శ్రీనాథుడు చెప్పిన వివరాలలోని సత్య మును పరిశీలించ వలసిఉన్నది. కావున తమరు ఆస్థాన వాస్తుశిల్పులను, తక్షణమే కొండ వీడునకు సౌధమును పరిశీలింపపంపవ లయును'' అని కోరాడు. రాయలు సమ్మతించి, ఇలా ప్రకటించాడు ''మహాకవీ, తక్షణమే మేము ఆస్థాన శిల్పులను కొండవీడుకు పంపు చున్నాము. నిజంగా గృహరాజ సౌధం ప్రపం చలో కెల్లా గొప్పదైనచో మేము మరిక సౌధ మును నిర్మించే పూనికను మానుకొందుము. లేనిచో, కొండవీడుపై దండయాత్ర తప్పదు. మా శిల్పులు తిరిగి వచ్చేవరకూ తమరు విజ యనగర పట్టణమును దాటి వెళ్ళరాదు. ఇది మా ఆజ్ఞ!'' శ్రీనాథుడు చిరునవ్వుతో అంగీకార మును తెలిపాడు

ఆ సాయంత్రం శ్రీనాథుడు, జరిగిన వివర ములన్నీ ఒక లేఖ రాసి, విజయనగర ఆస్థాన శిల్పులు కొండవీడును చేరడానికి సుమారు ఒక నెల పట్టవచ్చు గాన ఆలోగా గృహరాజ సౌధమును నిర్మించి వుంచవలసి నదిగా కోరుతూ, ఆ లేఖను విజయనగర గ్రామ దేవత ఆలయములో వుంచి, గ్రామదేవత సోదరుడైన పోతురాజుదేవరను లేఖను తక్షణమే కొండవీ డుకు చేర్చవలసినదిగా ప్రార్థించాడు. పోతు రాజు తన యోగబలంతో లేఖను వెంటనే కొండవీటిలో నున్న పెదకోమటి వేమారెడ్డికి చేర్చాడు. వేమారెడ్డి లేఖలోని వివరాలను చదు వుకొని, వెంటనే ఆస్థాన శిల్పులను రావించి గృహరాజుమేడను నెల రోజులలో నిర్మించ మని ఆదేశించాడు. ఆ రకంగానే శిల్పులు నెల రోజులలోనే మేడను అత్యద్భుతంగా నిర్మిం చారు. తనకు సాయంచేసిన పోతురాజు దేవ రకు వేమారెడ్డి గుడి కట్టించి ప్రతిష్ఠ చేసి ఉత్సవం జరిగేటట్లుగా ఏర్పాటుచేశాడు. విజ యనగర శిల్పులు వచ్చి మేడను చూసి, రెడ్డి రాజ్య శిల్పుల పని తనానికి ఆశ్చర్యపోయి రెడ్డి రాజును అభినందించి వెళ్ళారు. వారు తమ రాజ్యానికి చేరుకొని శ్రీనాథుడు చెప్పినదాంట్లో ఆవగింజంతైనా అబద్ధం లేదని తెలిపారు. దాంతో దేవరాయలు శ్రీనాథుని మరింత గౌర వించి అగ్రహారాలు దానం చేశాడు.

''ఇదీ కథ!'' అని ముగించాడు కొండారెడ్డి. ''అదుగో ఆ కనబడేదే పోతురాజు గుడి. తరు వాత కూడా పోతురాజు రెడ్డిరాజ్యానికి చెందిన ఉత్తరాలను ఇతర ప్రాంతాలకు చేరవేస్తూ ఉండే వాడట. ఉత్తరాన్ని గుడి ఎదురుగా ఉన్న తుమ్మచెట్టుకు రాత్రి వేలాడికడితే తెల్లవారేసరి కల్లా అది ఉద్దేశించినవారికి చేరేదట. కనపడు తున్న తుమ్మచెట్టు అప్పటిదేనని ఇక్కడివారు చెప్పుకుంటారు'' కొండారెడ్డి ముగించాడు. ''కథ అద్భుతంగా ఉందికానీ, నమ్మశక్యంగా లేదు...'' రాజారావు మొదలు పెట్టాడు. ఈసారి కొండారెడ్డి ఊరుకోలేదు. ''నిజమే, మొదట్లో నేనూ అలానే అనుకున్నాను. కానీ మా స్కూల్ సోషల్ మాష్టారు చెప్పారు. పూర్వం రెడ్డిరాజుల కాలంలో గృహరాజుమేడ ఉండేదనడానికి సాక్ష్యం ఉందని చెప్పాడు. రెడ్డి రాజైన పెదకోమటివేమారెడ్డి ఫిరంగిపురం. అదే ఇందాక మెయిన్‌రోడ్డు మీద మనకు తగి



లిన ఊరులో ఒక శాసనం వేయించాడు. అందులో ఆయన గృహరాజుమేడలో విశ్రాంతి తీసుకొనే వాడని వర్ణించబడింది.'' రాజారావు కూడా ఊరుకోలేదు. ''రాత్రికి రాత్రే ఉత్తరం అంత దూరం చేరేదెట్లా?'' పోతురాజు కథ కట్టుకథే కావచ్చు. కానీ పూర్వం పావురాలనీ, డేగలనీ ఉత్తరాల టపాకోసం వాడేవారు. అందువలన ఉత్తరం చేరడం సాధ్యమే కావొచ్చు'' రాజారావు సంతృప్తి చెందినట్టు కనబడలేదు. ఇక నాకు వారి వాదన మీద ఆసక్తి పోయింది. దూరంగా వెళ్ళి ఒక బండమీద కూర్చొని పోతురాజు గుడి వంక చూడసాగాను.

నెమ్మదిగా చీకట్లు అలముకోసాగాయి. మాతో వచ్చిన కుర్రాళ్ళు, అక్కడ సమతలంగా ఉన్న ప్రదేశాన్ని శుభ్రంచేసి రాత్రి గడపడానికి అనువుగా తయారుచేశారు. కొండారెడ్డి బ్యాగులోంచి రెండు ఆహార పొట్లాలు, బీరు బాటిళ్ళు తీసి వారికిచ్చాడు. వాళ్ళు అవి తీసుకొని, ఏదైనా అవసరమైతే పిలవమని చెప్పి దూరంగా ఉన్న బండలవైపు వెళ్ళిపోయారు. చెరొక బీరుబాటిల్ పట్టుకొని కూర్చొన్నారు కొండారెడ్డి,రాజారావు. నేను చేతిలోకి బాటిల్ తీసుకొన్నాను కానీ, ఎందుకో తాగడానికి మనస్కరించలేదు. కొండారెడ్డి, రాజారావు కొండవీడు చరిత్ర విషయాల గురించి మాట్లాడుకుంటూ బీరు తాగుతున్నారు. కాసేపటికి, అలసటో మరి ఆల్కహాల్ మత్తు ప్రభావమో ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు. నేను చుట్టూ చూశాను. చీకటి బాగా అలముకుంది. ఆకాశం నిండా నక్షత్రాలు కనబడుతున్నాయి. చుట్టూ కీచురాళ్ళ అరుపులు తప్ప నిశ్శబ్దంగా వుంది. నిద్రపోదామని కళ్ళుమూసుకున్నాను గానీ నిద్ర రావడం లేదు. మనసు నిండా ఆలోచనలు. ఆ ఆలోచనల నిండా కిరణ్మయి. తను లేకపోవడాన్ని నేను బాగా ఫీల్ అవుతున్నానని నాకే తెలుస్తోంది. ఒక స్త్రీ ఇంత త్వరగా మగవాడి మనసును ఆకట్టుకోగలదా. అదేనేమో, స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ. నిజానికి జరిగిన గొడవలన్నిటిలో ఎక్కువభాగం నా నోటి దురుసుతనం వల్ల వచ్చినవే. ఎంతగొడవలైనా పడుకునే సమయానికి ఇద్దరం సమాధాన పడటం, ఆ అనుభవాన్ని పంచుకోవడం.... అనుభవం గుర్తుకొచ్చేసరికి మనసు తియ్యగా మూలిగింది. ఎంతసేపు ప్రయత్నించినా కంటిమీదకి నిద్ర రావడం లేదు. చుట్టూ ఉన్న ప్రశాంత వాతావరణం వల్ల నాలో అంతరాత్మ మేలుకొంది. అంతస్సంఘర్షణ మొదలైంది. ''తప్పు నీదే'' అంది అంతరాత్మ. ''వెంటనే క్షమాపణ చెప్పు'' అని కూడా ఆదేశించింది. ఈసారి విచిత్రంగా నా అహం అడ్డు రాలేదు. కిరణ్మయికి ఫోన్ చేద్దామనుకొని సెల్‌లో చూస్తే సిగ్నల్ లేదు. ''అయినా ఈ కొండ మీద సిగ్నల్ ఎక్కడ నుంచి వస్తుంది. ఇప్పుడెలాగబ్బా, ఏదో చేయక పోతే నా అంతరాత్మ వప్పుకొనేలా లేదు. నిద్ర పట్టేలా లేదు. నా మనసులోని భావాలకు అర్జెంటుగా అవుట్ లెట్ కావాలి. కిరణ్మయి! అయాం సారీ'' గొణుక్కున్నాను. సరిపోలేదు. ఇంకా ఏదో చేయాలి. సెల్‌ఫోన్ టార్చి వేసి చుట్టూచూశాను. చిరుతిళ్ళు పొట్లం కట్టిన కాగితాలు కనబడ్డాయి. వాటిని తీసుకొని చేత్తో సరి చేశాను. సెల్‌టార్చి వెలుగులో చూసుకుంటూ ''కిరణ్మయి! అయాం సారీ!'' అని రాసాను. తర్వాత బండని ఆనుకొని కూర్చొన్నాను. గుండెబరువు దిగిపోయింది. మనసిప్పుడు ప్రశాంతంగా ఉంది. చేసిన తప్పుకు క్షమాపణ చెబితే ఇంత ప్రశాంతత కలుగుతుందని ఇప్పుడే అనుభవంలోకి వచ్చింది. ఇక మా మధ్య గొడవలకి తావులేదు. ఆలోచిస్తూండగా, ఒక చిలిపి ఆలోచన వచ్చింది. లేచి సెల్ టార్చి వెలుగులో చూసుకొంటూ పోతురాజు గుడి దగ్గరకు చేరుకొన్నాను. చిన్నగుడి. టార్చి లోపలికి వేసి చూశాను. లోపల విగ్రహం లేదు. అంతా దుమ్ము కొట్టుకొనిపోయి ఉంది. గుడి ముందర తుమ్మచెట్టు దగ్గరకెళ్ళాను. చీకటిలో చెట్టు నల్లగా తారు పూసినట్టుగా ఉంది. టార్చి వెలుతురులో చుట్టూ వెతికితే ఒక గడ్డి పోచ కనబడింది. ఉత్తరం రాసిన కాగితాన్ని చుట్టగా చుట్టి దాని చుట్టూ గడ్డిపోచను ముడి వేసి మరొక కొసను చెట్టు రెమ్మకు ముడివేశాను. నెమ్మదిగా వెనక్కు వచ్చి పడుకున్నాను. ''కొండమీద నుంచి కిందకి దిగగానే కిరణ్మయికి ఫోన్‌చేసి సారీ చెప్పాలి'' అనుకుంటూ. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. పొద్దున రాజారావు నిద్ర లేపితేలేచాను. ''తాగను కూడా తాగలేదు. అంత నిద్ర ఎలాపోయావురా?'' అని రాజారావు వెక్కిరించాడు. సూర్యోదయమయిపోయి వుంది. ఎండవేడి తెలుస్తోంది. ఇద్దరు కుర్రాళ్ళు సామానంతా సర్దేశారు. ''ఒక్క నిముషం!'' అని పోతురాజు గుడి దగ్గరకు వెళ్ళి చెట్టుకేసి చూశాను. నేను రాసిన ఉత్తరం అక్కడలేదు. కాని నేను కట్టిన గడ్డిపోచముక్క అలాగే చెట్టుకు వేలాడుతోంది. ఉత్తరం గాలికి పడిపోయి ఉంటుందని అనుకొని చుట్టు చూశాను. కనుచూపు మేరలో ఎక్కడా కనపడలేదు. ''కొంపదీసి పోతురాజు దేవర ఉత్తరాన్ని కిరణ్మయికి చేరవేయలేదు కదా!'' నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది. కిందకు దిగుతూ సెల్‌లో చూసుకుంటూనే ఉన్నాను. సిగ్నల్ రావడం లేదు. పూర్తిగా కిందకి దిగి కొండవీడు ఊర్లోకి వచ్చేటప్పటికి సిగ్నల్ వచ్చింది.

వెంటనే కిరణ్మయికి ఫోన్‌చేశాను. తీస్తుందో లేదో! ఫోన్ తీసిందితను. ''హలో'' ఎన్ని రోజులైందో ఆ గొంతువిని. ఎలా మొదలు పెట్టాలో తెలియలేదు. ఎలాగోలా గొంతు పెగల్చుకొని ''కిరణ్, అయాం సారీ రా!'' అన్నాను. అటు వైపు నుంచి నిశ్శబ్దం. ఇక లాభం లేదు. వెంటనే మొదలుపెట్టి నేను మాట్లాడదల్చుకున్నవన్నీ మాట్లాడేశాను. అటువైపు కిరణ్మయి ఏడుపు వినిపించింది. ''ఏయ్ సిల్లీ, ఏమైందనిరా ఏడుపు, ఇంకెప్పుడూ నిన్నుబాధపెట్టను'' అన్నాను. కిరణ్మయి మాట్లాడింది. ''యూ స్టుపిడ్, మనసులో ఇంతప్రేమ పెట్టుకొని పైకి మాత్రం నన్ను ఏడిపిస్తావా? నువ్వసలు ఫోన్ చేయవనే అనుకున్నాను. కానీ ఇవాళ పొద్దున ఏమి జరిగిందో తెలుసా? మా కొలీగ్సందరం పొద్దున్న బనశంకరి గుడికి వెళ్ళాం. అక్కడ నల్లగా ఉన్న ఒకతను నా పేరుపెట్టి పిలిచి దగ్గర కొచ్చి చేయి చూపించుకోమన్నాడు. అతనేం చెప్పాడో తెలుసా, ఈ నెల రోజులూ మనిద్దరికీ బాగాలేదుట. అందువల్లనే విడివిడిగా వున్నామట. ఇవ్వాల్టితో మంచిరోజులు వస్తాయనీ, నీ భర్త తన తప్పు తెలుసుకొని నీ దగ్గరకు వస్తాడనీ చెప్పాడు. గుడి నుంచి తిరిగి వచ్చేటప్పుడు చూస్తే అతను ఎక్కడా కనబడ లేదు. ఇప్పుడు రూముకి వచ్చాను. నువ్వు ఫోన్ చేశావు....'' కిరణ్మయి చెబుతూనే వుంది. నేను అప్రతిభుణ్ణై సెల్‌ఫోన్ వంకా, కొండ వంకా మార్చి మార్చి చూస్తుండిపోయాను.

✻

### చారిత్రకాంశానికి వర్తమానం జోడించిన కథ



గృహరాజు మేడను గురించి కొండవీటి కైఫీయత్తులో ప్రస్తావన వుంది. కీ.శే. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ గారు కొండవీటి కైఫీయత్తును ఆధారంగా చేసుకొని రాసిన కొండవీటి చరిత్రలో గృహరాజు మేడ గురించి వివరంగా రాశారు. రెడ్డిరాజుల కాలంలో కళలు పోషించ బడ్డాయని మనందరికి తెలుసు. వాస్తుశిల్పం, భవన నిర్మాణానికి కూడా ఇతోధిక ప్రోత్సాహం లభించిందని ఈ కథ ద్వారా మనకు తెలుస్తోంది. చారిత్రకాంశానికి, వర్తమానాంశాన్ని జోడించి కల్పించిన కథ 'గృహరాజుమేడ'.

-బి.వి.భద్రగిరీష్

**99121 56560**